ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 24 మే 2025

పూలతో రూపొందించిన మిక్కీ మౌస్



● ఏర్కాడులో ఏర్పాటైన పుష్పప్రదర్శన

విరుల సోయగం..

సందర్శకుల పారవశ్యం



పూలతో మేట్టూరు డ్యాం

సేలం జిల్లా ఏర్కాడులో వేసవి ఉత్సవాల్లో భాగంగా పుష్ప ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. అన్నా పార్క్‌లో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను మంత్రులు ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ఆర్.రాజేంద్రన్‌లు ప్రారంభించారు. వేసవి ఉత్సవాల్లో భాగంగా ఆరోగ్యమైన పిల్లల పోటీ, పారంపర్య వంటకాల పోటీ, పడవ పోటీలు, డాగ్ షో, యువకులకు ఫుట్ బాల్, క్రికెట్ తదితరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ బృందాదేవి తెలిపారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి

వివరాలు 7 లో...

కున్నూర్‌లో పండ్ల ప్రదర్శన

ప్రారంభించిన ప్రభుత్వ విప్



ప్రదర్శన ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ రామచంద్రన్, జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య



ప్రదర్శన సిద్ధమైన సిమ్స్ పార్క్ - ఫ్రూట్ కేక్

ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన నీలగిరి జిల్లా కున్నూర్‌లో 65వ పండ్ల ప్రదర్శన ఏర్పాటైంది. సిమ్స్ పార్క్‌లో ఏర్పాటైన ఈ ప్రదర్శనను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రన్ ప్రారంభించగా, కలెక్టర్ లక్ష్మీభవ్య తన్నీరు నేతృత్వం వహించారు. ప్రదర్శనలో వివిధ రకాలకు చెందిన 4 టన్నుల పండ్లతో రూపొందించిన వాహనాలు, జంతువులు తదితర నమూనాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పండ్లతో చేసిన కొబ్బరి చెట్టుతో కూడిన ఊయల, నారింజతో చేసిన జ్యూస్ జగ్, చెర్రీలతో చేసిన విజిల్, ద్రాక్ష, స్ట్రాబెర్రీలతో చేసిన జెయింట్ కేక్, ఐస్‌క్రీమ్ తదితరాల వద్ద పర్యాటకులు సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి

హస్తినలో స్టాలిన్

సోనియాతో భేటీ

నేడు నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు

ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): 'నీతి ఆయోగ్' 10వ గవర్నింగ్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. 2015లో కేంద్ర ప్రణాళికా సంఘానికి బదులుగా నీతి ఆయోగ్ కమిటీ ఏర్పాటైంది. ప్రధాని నరేంద్రమోదీ ఈ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇప్పటి వరకూ 9 సార్లు ఈ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ కమిటీ పదో సమావేశం శనివారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశంలో పాల్గొనాలని దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ఆహ్వానించింది. గత ఏడాది జూలై 27న జరిగిన నీతి ఆయోగ్ 9వ సమావేశాన్ని స్టాలిన్ బహిష్కరించిన విషయం తెలిసిందే. ఆ యేడాది బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల ప్రస్తావన లేని కారణంగా ఆ సమావేశాన్ని బహిష్కరించినట్లు స్టాలిన్ ప్రకటించారు. ఈ పరిస్థితులలో శనివారం జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో స్టాలిన్ పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం మీనంబాక్కం విమానాశ్రయం నుంచి సీఎం ఢిల్లీ బయలుదేరివెళ్ళారు. ఆయన వెంట రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మురుగానందం, సీఎం కార్యదర్శి షణ్ముగం కూడా ఉనానరు. మధ్యాహ్నం 1.15 గంటలకు ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రికి డీఎంకే ఎంపీలు టీఆర్ బాలు, తిరుచ్చి శివ, జగ్రద్రక్షకన్, ఎ.రాజా, కళానిధి వీరాస్వామి, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి విజయన్ తదితరులు ఘనంగా స్వాగతించారు. అనంతరం సీఎం స్టాలిన్ తమిళనాడు హౌస్‌కు వెళ్ళి అక్కడే బసచేశారు. పెండింగ్‌లో వున్న నిధులను వెంటనే విడుదల చేయాలని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించనున్నట్లు స్టాలిన్ తన ఎక్స్ పేజీలో తెలిపారు. అలాగే కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, ఎంపీ రాహుల్ గాంధీలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలతో పాటు సోనియా ఆరోగ్య పరిస్థితిని స్టాలిన్ అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా, నీతి అయోగ్ సమావేశం శనివారం పూర్తయిన తరువాత రాత్రికి సీఎం తిరుగుముఖం పడతారని అధికారవర్గాలు తెలిపాయి.



రాహుల్, సోనియాగాంధీలను కలుసుకున్న స్టాలిన్

కోవై, నీలగిరి జిల్లాలకు రెడ్ అలర్ట్

రేపు, ఎల్లుండి పొంచివున్న ముప్పు

రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు ఆదివారం నుంచి రెండు రోజుల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయ చర్యల్లో భాగంగా ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలను రంగంలోకి దింపింది. తూర్పు మధ్య అరేబియా సముద్రంలో గురువారం ఏర్పడిన అల్పపీడనం, మరింత బలపడి ఉత్తర దిశగా పయనించి వాయుగుండంగా మారనుంది. దీని ప్రభావంతో 25, 26 తేదీల్లో కోయంబత్తూర్ జిల్లాలోని కొండ ప్రాంతాలు, నీలగిరి జిల్లాలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో అతి భారీవర్షాలు కురిసే అవకాశముంది. దిండుగల్, తేని, తెన్‌కాశి జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురవనున్నాయి. అదేవిధంగా తిరుప్పూర్, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో నైరుతి రుతుపవనాలు మరో రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశముంది.

అతి భారీవర్ష సూచన నేపథ్యంలో, కోవై, నీలగిరి జిల్లాలకు రాష్ట్ర జాతీయ విపత్తు నిర్వహణకు చెందిన మూడు బృందాలు వెళ్లాయి. ఊటీ, వాల్పారై ప్రాంతాలకు తలా ఒక బృందం, కోవైలో మరో బృందం మకాం వేసి పరిస్థితులను పర్యవేక్షించనుంది. అలాగే, సీనియర్ అధికారులు రెండు జిల్లాలకు వెళ్లి పరిశీలించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి నష్టం జరగకుండా పర్యవేక్షించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ తెలియజేసింది.

మరో ధర్మాసనానికి మంత్రి సుబ్రమణ్యం కేసు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఎం.సుబ్రమణ్యంకు వ్యతిరేకంగా భూ ఆక్రమణ కేసు చెన్నై ప్రత్యేక కోర్టులోని మరో న్యాయమూర్తి ధర్మాసనానికి బదిలీ చేశారు. మంత్రి సుబ్రమణ్యం 2006-11 మధ్య కాలంలో చెన్నై మేయర్‌గా ఉన్న సమయంలో కార్మికులకు కేటాయించిన సిడ్కో స్థలాన్ని తన భార్య పేరుతో రిజిస్టర్ చేశారంటూ నమోదైన కేసు, ఎంపీ, ఎమ్మెల్యేలపై ఫిర్యాదులను విచారించే చెన్నై ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసుకు సంబంధించి ఎం.సుబ్రమణ్యం దాఖలుచేసిన అప్పీలు పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. ఈ నెల మొదటి వారంలో ఈ కేసు విచారణకు రాగా, ఈ నెల 23వ తేది మంత్రి సుబ్రమణ్యం, ఆయన భార్య హాజరుకావాలని ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసు శుక్రవారం విచారణకు రానున్న సమయంలో మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఆ ప్రకారం, ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ప్రభాకరన్ విచారిస్తున్న కేసు, మరో న్యాయమూర్తి వెంకటవర్ధన్‌తో కూడిన ధర్మాసనానికి బదిలీ అయింది.

హాజరు కాని మంత్రి...

ఈ కేసుకు సంబంధించి శుక్రవారం మంత్రి సుబ్రమణ్యం, ఆయన భార్య శుక్రవారం కోర్టుకు రావాలని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, శుక్రవారం ఈ కేసు న్యాయమూర్తి వెంకటవర్ధన్ విచారించారు. మంత్రి తరఫున హాజరైన న్యాయవాది... ముందుగానే నిర్ణయించిన ప్రకారం, మంత్రి అమెరికా వెళ్లారని, విచారణ వాయిదావేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అభ్యర్థన అంగీకరించిన న్యాయమూర్తి, తదుపరి విచారణ జూన్ 17వ తేదీకి వాయిదావేశారు.

● వీసీల నియామక వ్యవహారం..

సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ప్రభుత్వం

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికిచ్చే చట్ట సవరణపై మధ్యంతర స్టే విధించిన మద్రాసు హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే కల్పించేలా తమిళనాడు ప్రభుత్వం ఆమోదించిన చట్టాన్ని ఇటీవల సుప్రీంకోర్టు తన ప్రత్యేక అధికారాలతో ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం తమిళనాడు ప్రభుత్వం వీసీల నియామకానికి సంబంధించిన చట్టాలను అధికారిక గెజిట్‌లో ప్రచురించింది. దీనిని వ్యతిరేకిస్తూ తిరునల్వేలికి చెందిన వెంకటాచలపతి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారించిన హైకోర్టు, ఈ వ్యవహారంపై బదులు పిటిషన్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చి, ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించాలని కేసు విచారణ వాయిదావేసింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ తరఫున హాజరైన న్యాయవాదులు... విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకానికి సంబంధించిన కేసు విచారణ సుప్రీంకోర్టులో జరుగుతోందని, అందువల్ల ఈ కేసు సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ వేశామన్నారు. ఈ కేసును అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని, పిటిషనర్ ఓ రాజకీయ పార్టీకి చెందినవారు కావడంతో రాజకీయ ఉద్దేశ్యంతో పిటిషన్ వేశారని వాదించారు. అలాగే, చట్టం గెజిట్ చేయబడిన తర్వాత, మొత్తం పది విశ్వవిద్యాలయాలకు గాను కేవలం రెండు విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఉప కులపతుల సెర్చ్ కమిటీని నియమించామని, అర్హులైన వారు జూన్ 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరామన్నారు. అందువల్ల ఈ పిటిషన్‌పై స్పందించేందుకు కొంత సమయం కావాలని అభ్యర్థించారు. రాజకీయ శక్తుల నుంచి విశ్వవిద్యాలయాలను రక్షించేందుకు ఈ పిటిషన్ దాఖలుచేశామని, యూజీసీ నిబంధనలు ఉల్లంఘించి చట్టం రూపొందించారని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని యూజీసీ తరఫున హాజరైన అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేశన్ పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనల అనంతరం చట్టం అమలుపై స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు చేయనున్నట్లు సీనియర్ న్యాయవాది విల్సన్ తెలిపారు. ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో, ఈ పిటిషన్ విచారణకు అంగీకరించడం సమంజసం కాదంటూ సుప్రీంకోర్టులో అప్పీలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

టీవీకే విజయావకాశాలపై ఈపీఎస్ రహస్య సర్వే?

ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ పార్టీలన్నీ విజయమే లక్ష్యంగా అస్త్ర, శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రధాన పార్టీల బలాబలాలు ఎలా ఉన్నాయి? ఎన్నికలకు సంబంధించి ప్రజల్లో ఎలాంటి అభిప్రాయాలున్నాయి? ఈసారి ఎవరికి ఓటు బ్యాంకు పెరిగే అవకాశముంది? అని తెలుసుకునేందుకు ప్రధాన ఏజెన్సీల ద్వారా సర్వేలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరోవైపు ప్రధాన ప్రతిపక్షానికి ఏ మేరకు ప్రజల మద్దతు, వ్యతిరేకత ఉందో తెలుసుకునేందుకు అధికార డీఎంకే తరుపున ముఖ్యమంత్రి స్టాలిన్ అల్లుడు శబరీశన్ నిర్వహిస్తున్న బెన్ సంస్థ ఇటీవల సర్వే ప్రారంభించింది. అదేవిధంగా కొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రముఖ సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకొనేందుకు ఆ పార్టీ ఎన్నికల విభాగం కార్యదర్శి ఆదవ్ అర్జున్ నిర్వహిస్తున్న వాయిస్ ఆఫ్ కామన్ సంస్థ చర్యలు చేపట్టింది. ఇక అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదేశాల మేరకు ఆయన కుమారుడు మిథున్ ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల పరిస్థితిపై అధ్యయనం ప్రారంభించినట్లు తెలిసింది. ఈ సంస్థ ప్రతి మూడు నెలలకొకసారి సర్వే నిర్వహిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు ప్రజల మనోభావాలు ఎలా వున్నాయి. ఏఏ పార్టీలకు ప్రజాదరణ పెరుగుతోందన్న సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం విజయావకాశాలపై అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి రహస్యంగా జరిపించిన సర్వేలో విజయ్ పార్టీ ఒకటి,రెండు స్థానాల్లో మాత్రమే గెలిచే అవకాశముందని తెలిసింది. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీకి 234 నియోజకవర్గాల్లో ఓటు శాతం పెరిగి, కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందేందుకు అవకాశాలున్నట్లు తెలిసింది.

ఎన్ఈపీపై సంతకం చేయలేదు అందుకే నిధులు కేటాయించలేదు

● హైకోర్టుకు తెలిపిన కేంద్రప్రభుత్వం

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం సహా పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందంపై సంతకం చేయకపోవడం వల్లనే తమిళనాడుకు విద్యా నిధులు కేటాయించలేదని కేంద్రప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఎంఓయూపై సంతకం చేయకపోవడం వలనే 25 శాతం పేదవిద్యార్థుల రిజర్వేషన్ కోసం ట్యూషన్ ఫీజు కేటాయించలేదని వివరించింది. నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కింద పేద విద్యార్థుల అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ప్రకటన చేయలేదంటూ కోవైకి చెందిన 'మరుమలార్చి ఇయక్కం' నిర్వాహకుడు ఈశ్వరన్ మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం చేయగా, కేంద్ర ప్రభుత్వం నిధులివ్వడం లేదని, ఆ కారణంగానే తాము ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కోటా కింద ట్యూషన్ ఫీజు కేటాయించలేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే. విద్యా హక్కు చట్టంలో 25 శాతం రిజర్వేషన్ కింద అడ్మిషన్లు పొందే విద్యార్థుల ఫీజు 60 శాతం కేంద్రప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి 2023 వరకు విద్యా ఫీజుకు సంబంధించిన నిధులు కేటాయించలేదని పేర్కొంది. దీంతో వంద శాతం రాష్ట్ర ప్రభుత్వమే అందజేసిందని, ఇకముందు కూడా కేంద్రప్రభుత్వం నిధులివ్వని పక్షంలో ఏం చర్యలు చేపట్టాలన్నదానిపై చర్చించేందుకు ఈ నెల 28న ఉన్నతాధికారులు సమావేశమవుతున్నారని వివరించింది. దీంతో నిధులు ఎందుకు కేటాయించలేదో తక్షణమే చెప్పాలని హైకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు మళ్లీ విచారణ జరిగింది. కొత్త విద్యావిధానంతో సహా పలు అంశాలకు సంబంధించి కేంద్రప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేయకపోవడం వల్ల 25 శాతం పేద విద్యార్థుల రిజర్వేషన్‌కు ట్యూషన్ ఫీజు కేటాయించలేదని ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేశన్ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఒప్పందంపై సంతకాలు చేశాయని, తమిళనాడు ప్రభుత్వం మాత్రమే సంతకం చేయలేదన్నారు. ఒప్పందంపై సంతకం చేయకపోతే నిధులు ఇవ్వకూడదనే కేంద్రప్రభుత్వ వైఖరి అహంకారానికి నిదర్శనమని ఈ సందర్భంగా అడిషనల్ అడ్వకేట్ జనరల్ రవీంద్రన్ వ్యాఖ్యానించారు. ఇరువర్గాల వాదనలు ముగియడంతో 25 శాతం రిజర్వేషన్ సీట్ల కేటాయింపు వ్యవహారానికి సంబంధించి ఈ నెల 28వ తేదీ జరుగనున్న సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణ వాయిదా వేసింది.





కశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో గాయపడి న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న రాష్ట్రానికి చెందిన డాక్టర్ పరమేశ్వరన్‌ను శుక్రవారం పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. (చిత్రంలో) మంత్రి ఏవీ వేలు, ఎంపీలు టీఆర్ బాలు, రాజా తదితరులు

తాకట్టు నగలపై నిబంధనలు

ఉపసంహరించుకోండి

● ఆర్‌బీఐకి ఈపీఎస్ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి, మాజీమంత్రి బెంజిమెన్ తదితరులు

ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలు నగలు తాకట్టు పెట్టేందుకు విధించిన కొత్త నిబంధనలను ఉపసంహరించుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఈపీఎస్ 71వ జన్మదినం సందర్భంగా తిరువళ్లూరు జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం ఉదయం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. రాజా అన్నామలైపురంలోని గ్రీన్‌వేస్ రోడ్డులోవున్న ఈపీఎస్ నివాసంలో మాజీమంత్రి పి.బెంజిమెన్, మాజీ కౌన్సిలర్ రాయపురం మనో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేతలకు బంగారు నాణెం, మోటర్ సైకిల్, రోలింగ్ షీల్డ్, జ్ఞాపికలను ఈపీఎస్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, భారతదేశ జనాభాలో సుమారు 80శాతం మంది పేద,మధ్య తరగతి వారని, వీరు నిత్యం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నగదు అవసరమైన సమయంలో వీరు తమ నగలను సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల్లో తాకట్టుపెడుతుంటారని, వీరికి నష్టం కలిగించేలా తాకట్టు నగలకు ఆర్‌బీఐ ఇటీవల విధించిన కొత్త నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయని, అన్నాడీఎంకే కూటమిలో చేరేందుకు పలు పార్టీలు ముందుకొస్తున్నాయని, మెజారిటీ విజయం సాధించేలా బలమైన కూటమిని ఏర్పాటు చేయనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.

సమాచార దర్శిని

రేపు 'వెన్నెలకంటి సాహిత్యం-సినీ వెన్నెల జలపాతం'

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): 'వేదవిజ్ఞానవేదిక' ఆధ్వర్యంలో ఆదివారం 'వెన్నెలకంటి సాహిత్యం - సినీ వెన్నెల జలపాతం' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం జరుగనుంది. 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహికలో భాగంగా జరుగనున్న ఈ కార్యక్రమంలో మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు ఉపన్యసించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

2 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2వ తేది నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీచేసింది. ప్రాథమిక విద్య డైరెక్టరేట్ ఆధ్వర్యంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలకు ఏప్రిల్ 30వ తేది నుంచి జూన్ 1వ తేది వరకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో, ఎండ తీవ్రతను పరిగణలోకి తీసుకుని పాఠశాలలు ప్రారంభించే తేదీల్లో మార్పులు ఉంటాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ఎండ తీవ్రత తగ్గిన నేపథ్యంలో, ఇప్పటికే ప్రకటించిన మేరకు, జూన్ 2వ తేది నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని గత వారం పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో, జూన్ 2వ తేది నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, పాఠశాల తరగతి గదులు, ప్రాంగణాలు, మౌలిక వసతుల కల్పన తదితరాలు పూర్తిచేయాలని జిల్లా ప్రధాన విద్యాధికారుల ద్వారా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ పంపాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

మూలికా సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూలికా సౌందర్య సాధనాలు, చర్మ సంరక్షణ ఉత్పత్తుల తయారీపై ఈ నెల 28 నుంచి 30 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. 18 ఏళ్లు పూర్తయి, టెన్త్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు శిక్షణా తరగతులకు హాజరుకావచ్చు. యువతీ, యువకులకు తక్కువ అద్దెతో వేర్వేరుగా బస వసతి కల్పించనున్నారు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్,8668102600అనే నెంబరు సంప్రదించవచ్చు.

రాష్ట్రానికి 7.84 లక్షల పక్షుల రాక

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఈ ఏడాది 798 జాతులకు చెందిన 7.84 లక్షల పక్షులు వచ్చినట్లు పక్షుల సర్వేలో తెలిసింది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పక్షుల గణన చేపడుతుంటారు. ఈ ఏడాది 38 జిల్లాల్లో 934 ప్రాంతాల్లో నీటి పక్షులు, 1,093 ప్రాంతాల్లో నేల పక్షుల గణన చేపట్టారు. నీటి వనరుల ప్రాంతాల్లో 397 జాతులకు చెందిన 5,52,349 పక్షులు రాగా, వాటిలో 136 జాతులకు చెందిన 1,13,606 విదేశీ పక్షులున్నాయి. నేల ప్రాంతాల్లో 401 జాతులకు చెందిన 2,32,219 పక్షులు రాగా, వాటిలో 118 జాతులకు చెందిన 17,670 విదేశీ పక్షులున్నాయి. గణన ఆధారంగా ఆయా ప్రాంతాల్లో పక్షులు నివసించేందుకు అవసరమైన వసతులు కల్పించనున్నట్లు అటవీ శాఖ కార్యదర్శి సుప్రియా సాహు తెలిపారు.

కార్పొరేషన్ పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో కార్పొరేషన్ పాఠశాలల్లో అడ్మిషన్లు రెండు రెట్లు పెరిగాయని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. జీసీసీ విద్యా శాఖ ఆధ్వర్యంలో 206 ప్రాథమిక, 130 మాధ్యమిక, 46 ఉన్నత, 35 మహోన్నత పాఠశాలుండగా, సుమారు లక్ష మందికి పైగా విద్యార్థులున్నారు. 2025-26వ విద్యా సంవత్సరానికి కార్పొరేషన్ పాఠశాలల్లో అడ్మిషన్లు మార్చిలో ప్రారంభమయ్యాయి. ఆ ప్రకారం, గత ఏడాది 6వేల మంది విద్యార్థులు మాత్రమే కార్పొరేషన్ పాఠశాలల్లో అడ్మిషన్ల పొందగా, ఈ ఏడాది ఇప్పటివరకు 15,618 మంది అడ్మిషన్లు పొందారు. వారిలో యూకేజీలో అధికంగా 7,386 మంది చేరారు. అడ్మిషన్లకు ఇంకా అవకాశముండడంతో చేరే వారి సంఖ్య పెరిగే అవకాశముందని జీసీసీ అధికారులు తెలిపారు.

3 నుంచి అల్పాహారం పథక విస్తరణ

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి రోజైన జూన్ 3వ తేది నుంచి అల్పాహార పథకం విస్తరించనున్నారు. రాష్ట్రంలో 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకం 2022 సెప్టెంబరు 15వ తేది ప్రారంభించారు. తొలివిడతగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందజేస్తున్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోని ఎయిడెడ్ పాఠశాలకు విస్తరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి నగర ప్రాంతాల్లోని 1,545 ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 1.14 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించనున్నారు. ఈ పథకానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.600 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఆ ప్రకారం, జూన్ 3వ తేది నుంచి నగరాల్లో ఎయిడెడ్ పాఠశాలలకు ఈ పథకం విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు.

మాస్క్ తప్పనిసరి కాదు

● ఆరోగ్య శాఖ స్పష్టీకరణ

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తిపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, అదే సమయంలో బహిరంగ ప్రాంతాల్లో మాస్క్ ధారణ తప్పనిసరి కాదని రాష్ట్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. సింగపూర్‌లో కరోనా వ్యాప్తి మళ్లీ ప్రారంభమైంది. అదే సమయంలో దేశంలో కూడా కరోనా కేసులు నమోదవుతున్నాయి. తమిళనాడులో కూడా 66 కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ తెలియజేసింది. ఈ క్రమంలో, బహిరంగ ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విషయమై ఆరోగ్యశాఖాధికారులు స్పందిస్తూ.. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణలో ఉందన్నారు. ప్రస్తుతం వస్తున్న వైరస్ రూపాంతరం చెందిన రకమని, ప్రాణాంతకం కాదన్నారు. కానీ, ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించడం మంచిదని, జలుబు, జ్వరం, దగ్గు తదితర లక్షణాలు రెండు రోజులకు పైగా ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

12న మేట్టూరు డ్యాం నుంచి నీరు విడుదల

● పరిశీలించిన కలెక్టర్ బృందాదేవి



డ్యాంను పరిశీలిస్తున్న కలెక్టర్ బృందా దేవి, జలవనరుల శాఖ అధికారులు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యాం నుంచి డెల్టా సాగు కోసం జూన్ 12వ తేది ముఖ్యమంత్రి నీరు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మేట్టూరు డ్యాంను సేలం జిల్లా కలెక్టర్ బృందాదేవి గురువారం పరిశీలించారు. కావేరి డెల్టా సాగుకు మేట్టూరు డ్యాం నుంచి ప్రతి ఏడాది జూన్ 12వ తేది నీరు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది డ్యాంలో సమృద్ధిగా నీరుండడంతో జూన్ 12వ తేది సాగు నీటిని విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ఆ ప్రకారం, జూన్ 12న మేట్టూరు డ్యాం నుంచి నీటిని విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ రానున్నారు. సీఎం పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జలవనరు శాఖ ఏఈఈ సెల్వరాజ్, డీఆర్వో సుకుమార్, తహసీల్దార్ రమేష్, డీఎస్పీ ఆరోగ్యరాజ్, అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ తదితరులున్నారు.

110 అడుగులకు చేరిన నీటి మట్టం...

కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు డ్యాంకు ఏడు రోజులుగా నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం ఉదయం డ్యాంకు సెకనుకు 12,819 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, ఆదివారం ఉదయం 13,606 ఘనపుటడుగులకు పెరిగింది. దీంతో, డ్యాం నీటి మట్టం 110.77 అడుగులకు పెరిగింది. డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు వెయ్యి ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులు చేరుకోడానికి ఇంకా 9 అడుగులు నీరు రావాల్సి ఉంది.

బ్లడ్ డొనేషన్ యాప్ ప్రారంభం



యాప్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేలూరులో ప్రముఖ సేవా సంస్థ ' బ్లడ్ డొనేషన్ యాప్'ను కలెక్టర్ సుబ్బులక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మనకు ప్రాణం పోసిన ఆ దేవుడు, ప్రాణాపాయ స్థితిలోవున్న మరో ప్రాణాన్ని రక్షించేందుకు ఇచ్చిన అవకాశమే బ్లడ్ డొనేషన్ అని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి బ్లడ్ డొనేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి హరికృష్ణన్, సంస్థ ఆర్గనైజర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాబిస్ ఇంజక్షన్ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

వేలూరు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధికుక్కలకు రాబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ శిబిరాన్ని శుక్రవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత పాల్గొన్నారు. ఈ శిబిరాలను వేలూరులోనే కాకుండా త్వరలో గుడియాత్తం, కాట్పాడి తదితర ప్రాంతాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులకు 20 లక్షల ల్యాప్‌టాప్‌లు

● టెండర్లు ఆహ్వానించిన ఎల్కాట్

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వనున్న 20 లక్షల ల్యాప్‌టాప్‌ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వ ఎల్కాట్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు ఆహ్వానిస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థుల పురోగతి, విద్యలో తమిళనాడు ఒక మార్గదర్శకంగా రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలుచేస్తోంది. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేలా 2011 సెప్టెంబరు 15న అప్పటి ముఖ్యమంత్రి జయలలిత ఉచిత ల్యాప్‌టాప్ పథకం ప్రారంభించారు. ఈ పథకంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్ అందించారు. 2019వ సంవత్సరం వరకు అమలైన ఈ పథకం కరోనా కారణంగా ఐదేళ్లుగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో, 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో ఉచిత ల్యాప్‌టాప్ పథకాన్ని స్వల్ప మార్పులతో తిరిగి అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో, కళాశాల విద్యార్థులకు అందించేందుకు ల్యాప్‌టాప్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. 20 లక్షల ల్యాప్‌టాప్ కొనుగోలుకు అంతర్జాతీయ టెండర్లు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఎల్కాట్ సంస్థ ప్రకటన విడుదల చేసింది. 8 జీబీ రామ్, 256 జీబీ ఎస్ఎస్‌డీ హార్డ్ డిస్క్, 14 లేదా 15.6 ఇంచీల స్క్రీన్‌లతో ల్యాప్‌టాప్ ఉండాలని టెండర్‌లో తెలిపింది.

41 ప్రభుత్వాస్పత్రులకు రూ.116.55 కోట్లు కేటాయింపు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 41 ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.116.55 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రాల్లో ఆరోగ్య సదుపాయాలు బలోపేతం చేసేందుకు 2025-26వ ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం ఆరోగ్య గ్రాంట్ల కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఆ ప్రకారం, రాష్ట్రంలో తంజావూరు జిల్లాలో ఆరు, దిండుగల్‌లో నాలుగు, తిరువళ్లూర్, తూత్తుకుడి తదితర జిల్లాల్లో తలా మూడు, సేలం, కన్నియాకుమారి, కరూర్, మదురై, తిరువారూర్, నాగపట్టణం, పుదుకోట, రామనాథపురం, తిరువణ్ణామలై తదితర జిల్లాల్లో తలా రెండు ఆస్పత్రులకు నిధులు కేటాయించింది. మైలాడుదురై, నామక్కల్, రాణిపేట, కోవై-వేట్టకారన్‌పుదూర్, తెన్‌కాశి, శివగంగ, విల్లుపురం తదితర జిల్లాల్లో తలా ఒకటి చొప్పున 41 ప్రభుత్వాసుల అభివృద్ధి రూ.116.55 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని, ఈ పనులను 'నేషనల్ హెల్త్ మిషన్' ద్వారా ప్రజాపనుల శాఖ చేపడుతుందని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

ఎన్నికల్లో డీఎంకే ఓటమి తథ్యం

● మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓటమి తథ్యమని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ జోస్యం చెప్పారు. రాష్ట్రంలో పెరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ తంజావూరులో శుక్రవారం నగర అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో పాల్గొన్న ఉదయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... మూడేళ్లుగా రాష్ట్రాన్ని విమర్శిస్తున్నారంటూ ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ మహానాడులో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొనలేదని, కానీ ప్రస్తుతం నీతి ఆయోగ్ మహానాడులో పాల్గొనేందుకు సీఎం ఢిల్లీ వెళ్లారన్నారు. కేసుల నుంచి నిందితులను రక్షించేందుకే సీఎం ఢిల్లీ పర్యటన అని అనుమానం వస్తుందన్నారు. 2011 ఎన్నికల్లో నిరంతర విద్యుత్ కోతల సమస్య కారణంగాడీఎంకే అధికారం కోల్పోయిందన్నారు. కానీ, ప్రస్తుతం క్షీణిస్తున్న శాంతి భద్రతలు డీఎంకే ఓటమికి ప్రధాన కారణంగా ఉంటాయన్నారు.

అవినీతి రహిత పాలనే లక్ష్యం

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేయలత



ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు అవినీతి రహిత పాలనే అందించడమే తమ ప్రధాన లక్ష్యమని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేయలత పేర్కొన్నారు. తూత్తుకుడి విమానాశ్రయంలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి పరులకు గుణపాఠం చెప్పాలన్న సంకల్పంతోనే తమిళ చిత్రసీమలో హీరోగా రాణిస్తున్న సమయంలో విజయ్‌కాంత్ డీఎండీకేను స్థాపించారని తెలిపారు. ఆయన మరణానంతరం పార్టీ పగ్గాలు చేపట్టిన తాను విజయ్‌కాంత్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. టాస్మాక్ అవినీతి కేసులో చిక్కుకున్న విశాకన్ రాజాను వ్యక్తిగత పౌరుడిగా చూడకుండా బాధ్యతగల ఉన్నతాధికారిగా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. నాలుగేళ్ల డీఎంకే పాలనలో జరుగుతున్న అక్రమాలను రాష్ట్రప్రజలు గమనిస్తూనే ఉన్నారని వారు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి తీర్పు ఇస్తారని ఆమె అభిప్రాయ పడ్డారు.

సంప్రదాయ కళల పరిరక్షణ కోసం వినూత్న యత్నం

పాదాల కింద కర్రలతో 1,320 మెట్ల అధిరోహణ ● కళాకారుల సాధన



మెట్లు ఎక్కుతున్న కళాకారులు, నిర్వాహకులు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలను కాపాడుకుందామంటూ బాల కళాకారులు వినూత్న అవగాహన కల్పించారు. ఈరోడ్ చిన్నిమలైలో ఉన్న మురుగన్ ఆలయానికి వెళ్లాలంటే 1,320 మెట్లు ఎక్కాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, ఈరోడ్ 'ఉళవన్ ఆర్ట్ గ్రూప్' ఆధ్వర్యంలో బాల కళాకారులు తమ పాదాలకు చెక్కలు కట్టుకుని 1,320 మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే, రాష్ట్ర సంప్రదాయ కళలైన వల్లిగుమ్మి ఆట్టం, ఒయిలాట్టం, కంబందాట్టం సహా పలు కళారూపాలను కళాకారులు ప్రదర్శించారు. అంతరించిపోతున్న సంప్రదాయ కళలను రక్షించాలి, ఈ కళలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు వారం రోజుల్లోగా సర్టిఫికెట్లు

● మంత్రి సాత్తూర్ రామచంద్రన్

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వారం రోజుల్లో సర్టిఫికెట్లు అందించేలా చర్యలు చేపట్టామని మంత్రి సాత్తూర్ రామచంద్రన్ తెలిపారు. విరుదునగర్ జిల్లా అరుప్పుకోట పంచాయతి యూనియన్ శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, కలైంజర్ కనవు ఇల్లం పథక లబ్దిదారులకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వేసవి సెలవుల అనంతరం జూన్ 2 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు కుల, ఆదాయం సహా పలు సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉందన్నారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఈ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో వారికి సర్టిఫికెట్లు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. సర్టిఫికెట్లు అందించడంలో జాప్యం జరిగితే విద్యార్థులు, సంబంధిత తహసీల్దార్, ఆర్ఐలను సంప్రదించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

'ఒకే దేశం-ఒకే రేషన్' పథకంలో తిరుప్పూర్ జిల్లా మొదటి స్థానం

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం-ఒకే రేషన్' పథకంలో ప్రతినెలా పొరుగు రాష్ట్రాల కార్డులకు సరుకులు అందించడంలో తిరుప్పూర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 'ఒకే దేశం-ఒకే రేషన్' పథకంలో దేశవ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలను అనుసంధానం చేశారు. అందులో, రేషన్ కార్డుదారులు, దేశంలోని ఏ రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లోనైనా సరుకులు పొందవచ్చు. రాష్ట్రంలో 2020 నుంచి ఈ పథకం అమలులో ఉంది. దేశంలోనే రెడీమేడ్ దుస్తుల తయారీలో అగ్రగామిగా ఉన్న తిరుప్పూర్‌లో ఒడిశా, మహారాష్ట్ర, బిహార్, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాలకు చెందిన కార్మికులు కుటుంబాలతో సహా నివసిస్తూ రెడీమేడ్ దుస్తుల కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. ఈ విషయమై ఆహార శాఖ అధికారులు మాట్లాడుతూ... ఒకే దేశం-ఒకే రేషన్ పథకం కింద తిరుప్పూర్‌లో 64 మంది పొరుగు రాష్ట్రాల వారు సరుకులు పొందుతుండగా, రెండో స్థానంలో చెన్నై జిల్లాలో 8 మంది, మూడవ స్థానంలో ఉన్న కోవైలో ఇద్దరు రేషన్ సరుకులు పొందుతున్నారని తెలిపారు. ఆయా దుకాణాలకు అదనపు సరుకులు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కారు ప్రమాదంలో మాజీ మంత్రి మనవరాలి మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు ముందు భాగం

టి.నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం మేట్టుపాళయం - ఊటీ రహదారిలో కల్లార్ ఫ్లైఓవర్ వద్ద సంభవించిన కారు ప్రమాదంలో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ మనవరాలు మృతి చెందగా మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. మదురైలో నివసిస్తున్న శ్రీనివాసన్ మనవరాలు దివ్య ప్రియా (28) మదురైలో డెంటల్ క్లినిక్ నడుపుతున్నారు. ఆమె భర్త కార్తీక్‌రాజా, బంధువులు వలర్మతి (48), పరమేశ్వరి (44) సహా బంధువులతో ఊటీకి ఈ నెల 20న కారులో విహారయాత్రకు బయలుదేరారు. ఊటీ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన తర్వాత అందరూ గురువారం సాయంత్రం మదురై బయలుదేరారు. మదురైకి చెందిన పార్తీబన్ నడుపుతున్న కారు మేట్టుపాళయం - కున్నూరు ఘాట్‌రోడ్డు కల్లారు సమీపంలోని మలుపువద్ద బ్రేకులు పనిచేయకపోవడంతో అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. అదుపుతప్పిన ఆ కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దివ్య ప్రియా, పరమేశ్వరి, వలర్మతిని స్థానికుల సహాయంతో కార్తీక్‌రాజా, డ్రైవర్ పార్తీబన్ కారు శిథిలాల మధ్య నుండి వెలికి తీసి అంబులెన్స్‌ను రప్పించి చికిత్స కోసం మేట్టుపాళయం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి దివ్యప్రియా మార్గ మధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. మిగిలిన వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై మేట్టుపాళయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

హెల్మెట్ ధరించని ఎమ్మెల్యేకు జరిమానా

పెరంబూర్, మే 23: ద్విచక్రవాహనంపై హెల్మెట్ లేకుండా వెళ్లిన మహిళా ఎమ్మెల్యేకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేది కన్నియాకుమారి జిల్లా పంగల్ జంక్షన్ నుంచి కుళిత్తురై జంక్షన్ వరకు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కిల్లియూర్ ఎమ్మెల్యే రాజేష్‌కుమార్, విలవంగోడు మహిళా ఎమ్మెల్యే తారకై కుత్బర్ట్ సహా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. కాగా, అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారంటూ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే తారకై కుత్బర్ట్ సహా కొందరు హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై కాంగ్రెస్ జెండా ఉంచి పాల్గొన్నారు. ఈ క్రమంలో, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై వెళ్లిన మహిళా ఎమ్మెల్యేకు ట్రాఫిక్ పోలీసులు రూ.1,000 జరిమానా విధించారు.

పార్టీ అభివృద్ధికి పాటు పడండి

● ఎస్‌డీపీఐ మండల అధ్యక్షుడు బషీర్ అహ్మద్



నూతన సభ్యుడికి నియామక పత్రాన్ని అందిస్తున్న పార్టీ నేతలు

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని కేకేనగర్ పరిసర ప్రాంతాల్లోని పలువురు ఎస్‌డీపీఐ పార్టీ మండల అధ్యక్షుడు బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా తమ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రియాజ్ రెహమాన్, సెక్రటరీ జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించండి

● అధికారులకు ప్రజల వినతి



మరమ్మతులకు గురైన రోడ్లు

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు కార్పొరేషన్ పరిధిలోని సేన్‌బాక్కం గ్రామ వీధుల్లో మరమ్మతులకు గురైన రోడ్ల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. దీనిపై శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు తమ సమస్యలను తెలియజేశారు. గుంతలు పడిన రోడ్లవల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని వాపోతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా రోడ్ల మరమ్మతు పనులను చేపట్టాలని ప్రజలు అధికారులకు విన్నవించుకుంటున్నారు.

టీవీకే ఆధ్వర్యంలో కుట్టు మెషిన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్ల అందజేస్తున్న టీవీకే నేతలు

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం ఆధ్వర్యంలో వేలూరులో శుక్రవారం ఉదయం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీవీకే జిల్లా కార్యదర్శి వేల్‌మురుగన్ పాల్గొన్నారు. మహిళలకు కుట్టుమిషన్లు, పలు రకాల సంక్షేమ సహాయాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసన్, కోశాధికారి ప్రశాంత్, ఆర్గనైజర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

1.19 లక్షల మంది జాలర్లకు తలా రూ.8 వేలు

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1.19 లక్షల మంది జాలర్లకు చేపల వేట నిషేధ కాలం ప్రోత్సాహం అందజేసినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. సముద్ర జీవుల సంతానోత్పత్తి కోసం ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేది వరకు చేపల వేటపై నిషేధం విధిస్తుంటారు. ఆ ప్రకారం 14 తీర ప్రాంత జిల్లాలకు చెందిన సుమారు 15వేలకు పైగా ఫైబర్ పడవలు తీరానికే పరిమితమయ్యాయి. చేపల వేటపై నిషేధం విధించడంతో ఉపాధి కోల్పోయిన జాలర్లకు, నిషేధ కాలంలో తలా రూ.8వేల ప్రోత్సాహకంగా అందజేయనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, రూ.140.07 కోట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో, నిషేధ కాలం ప్రోత్సాహంగా 1.19 లక్షల జాలర్ల బ్యాంక్ ఖాతాల్లో బుధవారం నుంచి జమచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

కరాటే శిక్షణకు వచ్చిన విద్యార్థినికి గర్భం

డీఎన్ఏ పరీక్ష ద్వారా నిర్ధారణ ● మాస్టర్ అరెస్ట్

పెరంబూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కరాటే శిక్షణకు వచ్చిన విద్యార్థిని గర్భం దాల్చిన వ్యవహారంలో డీఎన్ఏ పరీక్ష ద్వారా నిందితుడిని పోలీసులు గుర్తించారు. తిరువణ్ణామలై సెంగం టౌన్ తిరువళ్లువర్ నగర్‌కు చెందిన ఎళిల్‌ఇసై కరాటే శిక్షణా కేంద్రం నిర్వహిస్తున్నారు. శిక్షణకు వచ్చే విద్యార్థిని మాయమాటలు చెప్పి ఎళిల్‌ఇసై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఆ విద్యార్థిని అస్వస్థతగా ఉండడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆమె గర్భంతో ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని వైద్యులు సెంగం మహిళా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ వ్యవహారంపై ఫిబ్రవరిలో పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఆ సమయంలో, తన గర్భానికి కారణం ఎవరో తెలియలేదని బాధితురాలు తెలపడంతో పోలీసులు ఖంగుతిన్నారు. ఈ నేపథ్యంలో, నెల రోజుల క్రితం బాధితురాలు తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డను ఓ స్వచ్ఛంధ సంస్థ సంరక్షణకు అనుమతించగా, విద్యార్థిని తల్లిదండ్రులతో వెళ్లింది. ఈ క్రమంలో, డీఎన్ఏ పరీక్షలో విద్యార్థిని గర్భానికి కారణంగా కరాటే మాస్టర్ ఎళిల్‌ఇసై అని నిర్ధారణ అవడంతో, సెంగం మహిళా పోలీసులు పోక్సో సహా నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి ఎళిల్‌ఇసైను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

రైలులో 5కిలోల గంజాయి స్వాధీనం

● పెరంబూరులో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి రైలులో పెరంబూరు రైల్వేస్టేషన్‌కు గంజాయి తరలించిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుండి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి ఒడిశా నుండి వచ్చిన రైలు నుండి పెరంబూరు రైల్వేస్టేషన్‌లో దిగిన ముగ్గురిని అనుమానాస్పదంగా అదుపులోకి తీసుకుని విచారణ జరిపి, వారి లగేజీని తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో ఉన్న 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకునానరు. వారు కేరళ రాష్ట్రం పాలక్కాడు ప్రాంతానికి చెందిన జినోజ్, అనస్, ఇంద్రజిత్ అని తెలిసింది. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచి, పుళల్ జైలుకి తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల వివరాలు.. అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలోని బి.బ్లాక్, న్యూ ట్రైనీ సెక్టార్, ఓల్డ్ ట్రైనీ సెక్టార్, 1వ మెయిన్ రోడ్డు, ఏటీసీ రోడ్డు, 2వ క్రాస్ వీధి, 3వ వీధి సెక్టార్-2, 2వ మెయిన్ రోడ్డు, సీటీహెచ్ రోడ్డు, మేనాంబేడు రోడ్డు, కోచర్ అపార్ట్‌మెంట్, కోరమాండల్ టౌన్, 7,8 వీధులు, సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్ నార్త్ ఫేస్, కుక్సన్ రోడ్డు, 7వ వీధి సెక్టార్-3. ఆవిన్ రోడ్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రేపటి నుంచి 21 సబర్బన్ రైళ్ల రద్దు

వాషర్‌మెన్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నేరి-కవరపేట మధ్య రైలు మార్గంలో మరమ్మతుల కారణంగా శనివారం, 26వ తేది చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట మార్గంలో మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు 21 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-పొన్నేరి, మీంజూరు, చెన్నై బీచ్-ఎన్నూర్ మధ్య మొత్తం 10 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

సినిమా నాశనానికి అదే కారణం

● ఆర్కే సెల్వమణి


'జిన్' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రపరిశ్రమలోని పలువురు హీరోలతో పాటు వర్ధమాన కథానాయకులు కథను మేనేజర్లు, అసిస్టెంట్లు వినమని చెబుతున్నారని, ఇదే సినిమా నాశనానికి ప్రధాన కారణమని పెఫ్సీ అధ్యక్షుడు, సినీ దర్శకుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారు. టీఆర్ బాలా దర్శకత్వంలో 'బిగ్‌బాస్' ఫేం ముగేన్ రావు, భవ్య త్రిఖ, రాధారవి, బాలశరవణన్, నిళల్‌గల్ రవి, వడివుక్కరసి, వినోదిని తదితరులు నటించిన చిత్రం 'జిన్'. కామెడీ హర్రర్ మూవీ జానర్‌లో తెరకెక్కించారు. టీఆర్ బాలా, అనిల్ కుమార్ రెడ్డి, వెంకటాచలం నిర్మాణ సారథ్యంలో వీజీవీ క్రియేషన్స్, సినిమారసా ప్రొడక్షన్స్‌తో కలిసి ఫెయిరీ టేల్ పిక్చర్స్, ఏఆర్ టూరింగ్ టాకీస్ ప్రొడక్షన్స్ నిర్మించాయి. ఈ మూవీ ఆడియో రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఇందులో చిత్ర బృందంతో పాటు మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కే కృష్ణన్, చిత్రపరిశ్రమకు చెందిన ఆర్కే సెల్వమణి, ఆర్‌వీ ఉదయకుమార్, జాగ్వార్ తంగంతో సహా పలువురు హాజరై ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సెల్వమణి మాట్లాడుతూ, 'వర్ధమాన కళాకారులకు ఒక విన్నపం. సినిమా స్టోరీలను మీరే వినండి. మీ అసిస్టెంట్లు, మేనేజర్లను వినమని చెప్పకండి. ఇలా చేయడం వల్లే సినిమా నాశనమైపోతోంది. హీరో, హీరోయిన్, దర్శకుడు మధ్య అవగాహన లేకపోతే ఆ సినిమా ప్రేక్షకాదరణకు నోచుకోలేదు. ఇండస్ట్రీలోని పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత ఈ విషయాన్ని గ్రహించాను' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు బాలా మాట్లాడుతూ,'నాలో ఒక నమ్మకాన్ని చిన్న వయసు నుంచే మా అమ్మ నూరిపోసింది.విజయ్ చిత్రాల్లో మూడింటికి పనిచేశాను.ఆ సమయంలో ప్రశాంతంగా, ఓర్పుగా ఎలా ఉండాలో నేర్చుకున్నాను. దెయ్యం నేపథ్యంలో సినిమా రూపొందించినప్పటికీ గత చిత్రాలకు భిన్నంగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించాం' అన్నారు. ఆ తర్వాత హీరోహీరోయిన్లు, నిర్మాతలు, ఇతర సాంకేతికవర్గం సభ్యులు ప్రసంగించారు. ఈ నెల 30వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడులకానుంది.

6న 'మద్రాస్ మ్యాట్నీ' విడుదల


'మద్రాస్ మ్యాట్నీ'లో దృశ్యం

డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సమర్పణలో సత్యరాజ్ - కాళి వెంకట్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'మద్రాస్ మ్యాట్నీ' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించింది. మద్రాస్ మోషన్ పిక్చర్స్ ప్రొడక్షన్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి కార్తికేయన్ మణి దర్శకత్వం వహించారు. ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్‌లుక్, టైటిల్ లుక్ విడుదల చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. సత్యరాజ్, కాళీ వెంకట్, రోషిణి హరి ప్రియన్, షెల్లీ, విశ్వ, జార్జ్ మరియన్, అర్చన చంద్రు, సునీల్ సుగద, మధుమిత, శామ్స్, గీతా కైలాసం తదితరులు నటించారు.

చంపేస్తామని బెదిరిస్తున్నారు

కెనీషా ఫ్రాన్సిస్



తనను చంపేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని బెంగళూరు గాయని కెనీషా ఫ్రాన్సిస్ వెల్లడించారు. పైగా తాను మంచి నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చానని, దయచేసి తనకోసం చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని ఆమె ప్రాధేయపడ్డారు. రవి మోహన్ - ఆర్తి రవి విడాకులకు కెనీషానే కారణమంటూ ప్రచారం సాగుతోంది. పైగా ఈ కేసు చెన్నై ఫ్యామిలీ కోర్టులో విచారణలో ఉంది. రవి మోహన్, ఆర్తి రవి, సినీ నిర్మాత ఆర్తి తల్లి సుజాత, కెనీషా పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కెనీషా ఫ్రాన్సిస్ తాజాగా చేసిన పోస్ట్‌లో తనపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండించారు. 'ఆ విడాకులకు నేను కారణమని ఎవరైనా నమ్మితే, నన్ను న్యాయస్థానానికి తీసుకెళ్ళండి. అక్కడ నిజానిజాలేంటో తేలుతాయి. నాకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. దయచేసి, ఆ ప్రచారాన్ని ఆపండి. నేను ఒక మంచి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చాను. నాపై సాగుతున్న ప్రచారంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నాను. నన్ను చంపేస్తామంటూ బెదిరింపులు కూడా వస్తున్నాయి. కొందరు కర్మ గురించి మాట్లాడుతున్నారు. కానీ, మా జీవితాలు, కుటుంబంలో ఏం జరుగుతుందో బహిర్గతం చేసుకునేందుకు నాకు ఇష్టంలేదు. నేను దేవుడిని మాత్రమే నమ్ముతున్నాను. జరిగే పరిణామాలన్నీ ఆ దేవుడికే వదిలేస్తున్నాను. నేను ఆయన వద్ద శరణు వేడుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

రోల్ మోడల్‌కు అజిత్ నివాళి


అయర్టన్ సెన్నా సమాధి వద్ద అజిత్ నివాళి


చిత్రజ్యోతి

కార్ రేసింగ్ పోటీల్లో తనకు రోల్ మోడల్‌గా ఉన్న బ్రెజిలియన్ కార్ రేసింగ్ స్టార్ అయర్టన్ సెన్నా సమాధి వద్ద అగ్రహీరో అజిత్ కుమార్ నివాళులర్పించారు. 1994లో శాన్ మారినో గ్రాండ్ ప్రిక్స్ కార్ రేస్ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ఆయన మృతితో ఫార్ములా వన్ రేస్ పోటీల నిబంధనల్లో మార్పులు చేశారు. ఈ నేపథ్యంలో ఇటలీలోని ఇమోలాలో ఉన్న ఆయన విగ్రహం, సమాధి ముందు అజిత్ మోకరిల్లి నివాళులర్పించారు. అలాగే, అయర్టన్ సెన్నా విగ్రహంపై ఉన్న హెల్మెట్‌ను అజిత్ ముద్దాడారు. ఇదిలావుంటే, అంతర్జాతీయ కార్ రేస్ పోటీల్లో అజిత్ పాల్గొంటున్న విషయం తెల్సిందే. దుబాయ్‌లో జరిగిన కార్ రేస్‌లో అజిత్ జట్టు మూడో స్థానంలో నిలువగా, ఆ తర్వాత ఇటలీలో జరిగిన రేసింగ్ పోటీల్లో మూడో స్థానం, బెల్జియంలో జరిగిన పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. గతవారం నెదర్లాండ్స్‌లో జరిగిన జిటీ 4 ఐరోపియన్ రేస్ పోటీల్లో పాల్గొన్న అజిత్ కుమార్ ఈ నెల 24వ తేదీ నుంచి ఇటలీలో జరుగనున్న మిసానో వరల్డ్ సర్క్యూట్ రేస్ పోటీల్లో పాల్గొనున్నారు.

ఏర్కాడులో నవవసంతం

● పుడమిపై పూలసోయగం



పేదల ఊటీగా పిలుచుకునే ఏర్కాడులో 48వ పుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వేసవి ఎండల్లో సేదతీరేందుకు కుటుంబాలతో సహా ఏర్కాడుకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంది. ఈ క్రమంలో, పర్యాటకులకు మరింత ఆహ్లాదం అందించేలా వ్యవసాయ, ఉద్యానవన, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బృందాదేవి మాట్లాడుతూ... శుక్రవారం ప్రారంభమైన ప్రదర్శన 29వ తేది వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రదర్శనలో 1.50 లక్షల పుష్పాలు వుంచామని, పిల్లలు, పెద్దలు ఆకర్షించేలా జంతువులు, పక్షుల బొమ్మలను రంగు రంగుల పూలతో ఏర్పాటుచేశామని తెలిపారు.




పండ్ల ప్రదర్శనలో విశేషాలంకరణ


నారింజ పండ్లతో రూపొందించిన జ్యూస్ జగ్


ఆరంజ్ పండ్లతో రూపొందించిన కారు

● సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణ

నీలగిరి జిల్లా కున్నూర్‌లో 65వ పండ్ల ప్రదర్శన ఏర్పాటైంది. 26వ తేది వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో పలు రకాల పండ్లుతో వివిధ ఆకృతుల్లో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది.
- చెన్నై,ఆంధ్రజ్యోతి


పండ్లతో చేసిన నెమలి


ఎటు చూసినా పండ్ల అలంకరణే




బంగాళాదుంపలతో రూపొందించిన నీలగిరి మేకలు - పండ్లతో సీతాకోకచిలుక - బొమ్మ



ఖర్జూరం పండ్లతో శాండ్ హౌస్

రష్యా సంస్థతో మద్రాస్ డయాబెటిస్ ఒప్పందం


కార్యక్రమంలో డాక్టర్ వి.మోహన్, ఎవైనీ ష్లియాఖ్తో

వాషర్‌మెన్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మధుమేహ పరిశోధనల్లో ప్రసిద్ధిగాంచిన మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో వున్న అల్మాజోవ్ నేషనల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌తో వ్యూహాత్మక పరిశోధనా సహకారాన్ని కుదుర్చుకుంది. ఎండీఆర్ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ వి.మోహన్, అల్మాజోవ్ సెంటర్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఎవైనీ ష్లియాఖ్తో ఇటీవల ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా రెండు సంస్థలు వైద్యనిపుణుల శిక్షణ, మార్పిడి, ఉమ్మడి శాస్త్రీయ సమావేశాలు, విద్యా సమావేశాలు, సహకార పరిశోధనా ప్రచురణలు, విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలను చేపడతాయి. ఈ సందర్భంగా డాక్టర్ వి.మోహన్ మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యం శాస్త్రీయ ఆవిష్కరణలతో పాటు ప్రపంచ ఆరోగ్యసవాళ్లలో ఒకటైన డయాబెటిస్‌ను ఎదుర్కోవడానికి దోహదపడతుందన్నారు.

స్వర్ణలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

● నిర్వహించిన శక్తి అమ్మ


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శక్తి అమ్మ

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని శ్రీపురం స్వర్ణాలయంలో నారాయణి పీఠాధిపతి శక్తిఅమ్మ ఆధ్వర్యంలో స్వర్ణలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారికి విశేష అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి శక్తిఅమ్మ చేతులమీదుగా మంగళహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు అమ్మవారిని సేవించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం అనంతరం ఆహార నాణ్యత గురించి శక్తి అమ్మ భక్తులను అడిగి తెలుసుకున్నారు.

శ్వేతారణ్యేశ్వరాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

● పాల్గొన్న సీఎం సతీమణి


ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో దుర్గా స్టాలిన్

ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా శీర్గాళి సమీపంలో తిరువెంకాడులోవున్న శ్వేతారణ్యేశ్వరాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించిన నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. నవగ్రహాల్లో ఒకటైన బుధుడికి ప్రత్యేక సన్నిధి కలిగిన శ్వేతారణ్యేశ్వరాలయానికి పలు ప్రత్యేకతలున్నాయి. శివ పరమాత్ముడు కొలువైన ప్రధాన శైవక్షేత్రాల్లో ఒకటిగా విరసిల్లుతున్న ఈ ఆలయంలో శివయ్య అఘోరా ముఖం కలిగి భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తున్నాడు. ఈ ఆలయంలో శిథిలమైన పాత ధ్వజస్తంభాన్ని తొలగించిన హిందూ దేవాదాయశాఖ కొత్త ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించింది. ఇందులో పాల్గొనేందుకు వెళ్లిన దుర్గా స్టాలిన్‌ను ఆలయ సంప్రదాయ మర్యాదలతో స్వాగతించిన శివాచార్యులు ఆమెకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యా సంస్థలతో సీఆర్‌హెచ్‌ఎం కీలక ఒప్పందం

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ది సెంట్రల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి విభాగం చెన్నై (తమిళనాడు), ఆంధ్రప్రదేశ్ తాడేపల్లిగూడెంలోని కీలక విద్యా సంస్థతో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నగర శివారు ప్రాంతం ముట్టుకాడులో ఉన్న ఎన్ఐఈపీఎండీలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏఎస్ఆర్ హోమియోపతి మెడికల్ కాలేజీ హాస్పిటల్, చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, తాంబరంలోని సాయిరాం హోమియోపతి మెడికల్ కౌన్సిల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ఏఎస్ఆర్ హోమియోపతి మెడికల్ కాలేజీ హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ యూఎస్వీ ప్రసాద్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.పొన్నుస్వామి, సాయిరామ్ హోమియోపతి మెడికల్ కౌన్సిల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చీరమన్నన్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయానంద్ సంతకాలు చేయగా, ఈ కార్యక్రమంలో హోమియోపతి హెచ్ఆర్ఐడీ చెన్నై విభాగం కన్సల్టెంట్, సీసీఆర్‌హెచ్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కొల్లిరాజు తదిరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

వేళచ్చేరిలోని ఆశ్రం స్కూల్‌లో స్పేస్ డెస్క్‌క్రియేషన్స్ ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను శుక్రవారం సూపర్ స్టార్ రజనీకాంత్ ఆసక్తిగా తిలకించారు. జూన్ 10వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ ఉచితంగా తిలకించవచ్చని నిర్వాహకులు వెల్లడించారు.



వ్యాసర్పాడి రవీశ్వరాలయంలో కల్యాణ మండపం

● ప్రారంభించిన మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడిలో 800ఏళ్ళ చరిత్ర కలిగిన పురాతన రవీశ్వరాలయ ప్రాంగణంలో రూ.55.85 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని శుక్రవారం దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ ఆలయానికి వస్తున్న భక్తుల విజ్ఞప్తి మేరకు ఆలయ నిర్వాహకులు కర్మకాండలు నిర్వహించేందుకు ఆలయ సమీపంలోవున్న తీర్థకొలనులో వసతి కల్పించారు. అదేవిధంగా తక్కువ అద్దెతో వివాహం తదితర శుభకార్యక్రమాల కోసం మరగదాంబళ్ పేరిట కల్యాణ మండపాన్ని నిర్మించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించి 12ఏళ్ళు పూర్తైన సందర్భంగా రూ.2.14 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు.


కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో మంత్రి శేఖర్‌బాబు, ఆలయ నిర్వాహకులు

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షల విరాళం



తిరుమల, మే23(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.17 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన పవర్‌మెక్ ప్రాజెక్ట్ లిమిటెడ్ ఎండీ సత్యరోహిత్ ఈ విరాళాన్ని అందజేశారు. రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీని అందజేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఒక పూట మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు వినియోగించాలని దాత కోరారు.

అదనపు ఈవోకి డీడీ అందజేస్తున్న దాత సత్యరోహిత్


'ఘాటు' రోడ్డుగా మార్చేస్తే ఎలా?



తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లేలా ఘాట్‌లో మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. ఈ క్షేత్రంలో మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. అక్కడి భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ నిషేధిత వస్తువులు కొండకు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే మొదటి ఘాట్‌రోడ్డులో పలు చోట్లు ఖాళీ మద్యం సీసాలు, వాడేసిన గుట్కా ప్యాకెట్లు, సిగరెట్ ప్యాకెట్లు ఉండటం భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈమార్గంలో మరమ్మతు పనులు చేస్తున్న కొందరు కార్మికులే వీటిని వాడుంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,579

తలనీలాలు సమర్పించినవారు: 34,067

శ్రీవారి సేవకు ప్రత్యేక శిక్షణ



'శ్రీవారి సేవ'ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేలా టీటీడీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చాక సేవకులకు అవకాశం కల్పించాలని భావిస్తోంది. తద్వారా భక్తులకు మరింత బాధ్యతగా సేవలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- ఆ తర్వాతనే సేవకులుగా అవకాశం
- ప్రణాళిక రూపొందిస్తున్న టీటీడీ

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో 2000 నవంబరు 1న టీటీడీ 'శ్రీవారిసేవ'ను ప్రారంభించింది. 195 మందితో ప్రారంభమైన ఈ సేవలో ఇప్పటివరకు 16 లక్షల మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఇప్పుడు వివిధ విభాగాల్లో రోజుకు 2,500 మంది సేవలందిస్తున్నారు. ప్రస్తుతం వచ్చే శ్రీవారి సేవకుల్లో 10 శాతం పాతవారుంటే.. 90 శాతం కొత్తవాళ్లు. ఈక్రమంలో సేవలు అందించే విధానంలో కొన్ని లోపాలు ఎదురవుతున్నట్టు తమ పరిశీలనలో అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో 50 శాతం చొప్పున కొత్త, పాత వారికి సేవ చేసే అవకాశం కల్పించాలని టీటీడీ భావిస్తోంది. ఇందులో భాగంగానే ఎలాంటి సమయ నిబంధన లేకుండా త్వరలో ఓపెన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించాలనే యోచనలో ఉంది. సేవకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని భావిస్తోంది. దీనికి తిరుపతితో పాటు మండల, జిల్లాస్థాయిల్లో ప్రత్యేక శిక్షకులతో శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇలా శిక్షణ పొంది సేవకు వచ్చేవారికి తిరుమలలోని పలు విభాగాల్లో సేవ చేసే అవకాశం కల్పిస్తారు. వీరికి సీనియర్లుగా ఉన్న సేవకులను గ్రూప్‌లీడర్‌గా ఏర్పాటు చేస్తారు. వీరు పర్యవేక్షకులుగా ఉంటూ సేవకుల పనితీరును పరిశీలించి రికార్డు చేస్తారు. మెరుగైన సేవలు అందించే వారి ఆధార్ సహా పూర్తివివరాలను టీటీడీ డేటాబేస్‌లో నమోదు చేస్తారు. ఇలా కొంతకాలం నిర్వహిస్తే శ్రీవారి భక్తులకు సేవకుల ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని టీటీడీ భావిస్తోంది. మరోవైపు ప్రస్తుతమున్న ఏడు రోజుల సేవే కాకుండా నెల, మూడు నెలల సేవలను కూడా ప్రారంభించాలని టీటీడీ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా వివిధ దేశాల్లో స్థిరపడిన భక్తులు కూడా సేవ చేసేందుకు మక్కువ చూపుతున్న క్రమంలో త్వరలో 'ఎస్‌ఆర్‌ఐ శ్రీవారిసేవ'ను కూడా ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇక, 'వృత్తిపరమైన సేవ' కింద వైద్యం, ఐటీ, డెయిరీఫాం విభాగాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నవారికి కూడా సేవచేసేందుకు అవకాశమివ్వాలని టీటీడీ ప్లాన్ చేస్తోంది.

సీఎం ఆదేశాలతో...

భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణా పరమైన సూచనలను, సలహాలను తీసుకోవాలని టీటీడీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో సత్యసాయి సేవా సంస్థ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈషా ఫౌండేషన్‌లను ఇప్పటికే టీటీడీ అధికారుల బృందం సందర్శించింది. అలాగే శ్రీవారి సేవ నిర్వహణకు సంబంధించి సత్యసాయి సేవా సంస్థ కూడా మార్చి నెలలో ఐదురోజుల పాటు తిరుమల, తిరుపతిలో పర్యటించి నివేదికను టీటీడీ అందజేసింది.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

యోగాపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025పై ప్రజలకు అవగాహన కల్పించి నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యోగాంధ్ర-2025 నిర్వహణపై జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, విజయవంతానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు. 29న తిరుపతి, జూన్ 4న చంద్రగిరికోట, 11న శ్రీకాళహస్తి/శ్రీహరికోట, 17న శ్రీహరికోట/శ్రీకాళహస్తిలో యోగాపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి తిరువాడుదురై ఆధీనం ఆశీర్వాదం

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా తిరువాడుదురై ఆధీన మఠాన్ని శుక్రవారం సమాజసేవకుడు, ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్ సందర్శించారు. ఈ క్రమంలో పీఠాధిపతి పరమాచార్యులు స్వామి చేతుల మీదుగా దినేష్‌కు మనిదనేయమమణి అనే బిరుదుతో సత్కరించారు. అనంతరం దినేష్‌కు మఠం తరుపున రూ.10వేలు పరమాచార్యులు అందించి, ఆశీర్వదించారు.



దినేష్‌కు ప్రశంసా పత్రాన్ని బహూకరిస్తున్న పీఠాధిపతి

తిరుమలలో దర్శకేంద్రుడు



బండ్ల గణేష్, కేవీ రావు, కె.రాఘవేంద్రరావు, సతీష్ వేమన

తిరుమల, మే23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శించుకున్నారు. ఇంకా నిర్మాతలు బండ్ల గణేష్, కేవీ రావు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శంకరనారాయణ పీఠాధిపతి జగద్గురు కంచి స్వామి ఉన్నారు. అంతకుముందు రాఘవేంద్రరావు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. దర్శనం తర్వాత రాఘవేంద్రరావు మీడియాతో మాట్లాడుతూ, పుట్టిన రోజున స్వామి అభిషేక సేవలో పాల్గొనడంతో తన జన్మ ధన్యమైందన్నారు. శ్రీవారి సేవలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానన్నారు. కాగా, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత బండ్ల గణేష్, తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన మర్యాదపూర్వకంగా కలిశారు.

'ఎయిర్ షో' ఘటనపై డీజీపీకి నోటీసు

వాషర్‌మెన్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ తీరంలో 2024లో నిర్వహించిన 'ఎయిర్ షో' సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు మృతిచెందారు. ఈ వేడుకల సందర్భంగా తగిన పోలీసు భద్రత ఏర్పాటుచేయనందు వలనే ఈ దుర్ఘటన జరిగిందని న్యాయవాది కె.సామి జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నాలుగు వారాల్లో బదులు పిటిషన్ దాఖలుచేయాలని డీజీపీకి మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

బస్సు నడుపుతూ డ్రైవర్‌కు గుండెపోటు

- కండక్టర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



వాషర్‌మెన్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): బస్సు నడుపుతున్న డ్రైవర్ హఠాత్తుగా గుండె పోటుకు గురికావడంతో, కండక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. దిండుగల్ జిల్లా పళని బస్టాండ్ నుంచి ఓ ప్రైవేటు బస్సు పుదుకోట గ్రామానికి శుక్రవారం బయల్దేరింది. బస్సు కనకపట్టి దాటి పుదుకోట వైపుకు వెళ్తున్న సమయంలో హఠాత్తుగా గుండెపోటుకు గురైన డ్రైవర్ ప్రభు సీట్లోనే స్పృహతప్పి పడిపోయాడు. ఆ సమయంలో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న కండక్టర్ విమల్ వెంటనే బ్రేక్ వేసి బస్సును రోడ్డు పక్కనే నిలిపాడు. అనంతరం ప్రభును రక్షించేందుకు యత్నించగా అతను అప్పటికే మృతిచెందినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్యాంట్ సరిగా కుట్టలేదని టైలర్ హత్య

వాషర్‌మెన్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్యాంట్ సరిగా కుట్టలేదని టైలర్‌ను హతమార్చిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ క్రిస్టియన్ కళాశాల జంక్షన్‌లో సెల్వం టైలరింగ్ దుకాణం నడుపుతున్నారు. గురువారం రాత్రి సెల్వం, దుకాణంలో తల, చెవులపై తీవ్ర గాయాలతో మృతిచెంది ఉండడం గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీ పరిశీలించగా, తూత్తుకుడికి చెందిన చంద్రమణి ఆ సమయంలో దుకాణానికి వచ్చినట్లు తెలిసింది. దీంతో, అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, కొత్తగా కొనుగోలు చేసిన ప్యాంట్ ఆల్ట్రేషన్ చేయాలని సెల్వంకు ఇవ్వగా, అతను సరిగా చేయలేదని, ఇదేమని అడిగితే వాగ్వివాదానికి దిగినట్లు, ఆవేశంలో అక్కడున్న కత్తెరతో అతనిపై దాడిచేసినట్లు తెలిసింది. దీంతో, పోలీసులు చంద్రమణిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కేఎంసీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

- మరో వార్డుకు రోగుల మార్పు

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రిలోని జనరల్ వార్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ వార్డులోని దాదాపు వంద మంది రోగులను మరో వార్డుకు తరలించారు. కీల్పాక్కం ప్రభుత్వ వైద్య కాలేజీ ఆస్పత్రిలో కొత్తగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా కొన్ని చోట్ల విద్యుత్ వైర్లను తొలగిస్తున్నారు. ఈ కారణంగా కొన్ని వార్డులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న వారిని మరో వార్డుకు మార్చి చికిత్స అందిస్తున్నారు.

ఎస్పీ వేలమణికి హత్యా బెదిరింపులు

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయ కార్యదర్శి, మాజీ మంత్రి, తొండాముత్తూరు ఎమ్మెల్యే ఎస్పీ వేలుమణికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు వచ్చాయి. ప్రస్తుతం ఆయన కునియముత్తూరులో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఈ నెల 16వ తేదీ ఆయనకు ఆకాశరామన్న లేఖ వచ్చింది. అందులో జూలై 30వ తేదీ లోపు బాంబు పేలుడు చేసి హత్య చేస్తామని పేర్కొన్నారు. దీంతో ఆందోళన చెందిన వేలుమణి కోయంబత్తూరు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ మందుల దుకాణాల ఉద్యోగుల సమావేశం

వేలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన ముఖ్యమంత్రి మందుల దుకాణాల ఉద్యోగుల సమావేశం జరిగింది. 2024-2025వ సంవత్సరానికి సం బంధించి మెడిసిన్స్ విక్రయాలు అధికంగా జరిపిన దుకాణాల లైసెన్స్ దారులకు, ఉద్యోగులకు బహుమతులందించి, వారిని కలెక్టర్ అభినందించా రు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, కో-ఆపరేటివ్ సంఘం జాయింట్ రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదురై, సంతానం తదితరులు పాల్గొన్నారు.

అక్క ఐపీఎస్.. చెల్లి ఐఏఎస్

- తల్లిదండ్రుల కల నెరవేర్చిన సోదరీమణులు

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బన్రుట్టి సమీపంలో అక్కా చెల్లెలు అరుదైన ఘనత సాధించారు. అక్క సుష్మిత ఐపీఎస్ అధికారిణిగా, చెల్లి ఐశ్వర్య ఐఏఎస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బన్రుట్టి సమీపంలోని మరుంగూరు అనే గ్రామానికి చెందిన రామనాథన్ - ఇళవరసి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. అన్నా వర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన వీరు సివిల్స్‌కు హాజరై ఈ అరుదైన ఫీట్ సాధించారు. దీంతో వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023లో వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో సుష్మిత ఐపీఎస్ సాధించారు. 2019లో జరిగిన సివిల్స్‌లో ఐశ్వర్య ఐఏఎస్ సాధించారు.

దుగరాజపట్నంలో పోర్టు నిర్మించాలి

- మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేస్తున్న చింతా మోహన్

గూడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నంలో నౌకానిర్మాణ కేంద్రం కాదు, మేజర్ పోర్టు కావాలి అని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపిన ఆయన, అనంతరం ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ పోర్టుకు ఇక్కడ అనుమతిచ్చిందన్నారు. ఇది పూర్తి చేయకుండా ప్రజల చెవిలో పూలు పెడుతున్నారని విమర్శించారు. మేజర్ పోర్టు నిర్మాణం పూర్తయితే వందల సంఖ్యలో పరిశ్రమలు వస్తాయన్నారు. ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు కాగా నిరుద్యోగ బ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు ఇసుక, క్వార్ట్జ్, సిలికా వంటి సహజ సంపదను కేటాయించాలన్నారు. కృష్ణా నదిలో కడుతున్న అమరావతి రాజధాని సక్సెస్ కాదని అన్నారు. అక్కడ నిర్మాణ వ్యయం పదింతలు పెరుగుతుందని, కూటమి నేతలు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, శివ, పెంచలయ్య, పూల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అభిమానుల మధ్య చిక్కుకున్న విజయ్ సేతుపతి

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి అభిమానుల రద్దీలో చిక్కుకుపోయారు. దీంతో ఆయన స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. విజయ్ సేతుపి - రుక్మిణి వంసత్ జంటగా నటించిన 'ఏస్' చిత్రం శుక్రవారం తమిళం, తెలుగు భాషల్లో విడుదలైంది. ఈ సినిమాను విజయ్ సేతుపతి క్రోంపేటలోని వెట్రి థియేటర్‌లో ఫ్యాన్స్, ఆడియన్స్‌తో కలిసి చూసేందుకు వెళ్ళారు. తమ హీరోను చూడగానే అభిమానులు ఒక్కసారిగా ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. దీంతో వారి మధ్యలో ఆయన చిక్కుకుపోయారు. వారి మధ్య నుంచి బయటపడేందుకు పెద్ద సాహసమే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత బౌన్సర్లు, థియేటర్ సిబ్బంది కలిసి విజయ్ సేతుపతిని సురక్షితంగా థియేటర్‌లోకి తీసుకెళ్ళారు.

కేసును న్యాయపరంగా ఎదుర్కొంటా

- సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన పోలీస్ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని కోలీవుడ్ సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్ తెలిపారు. తనను మోసం చేసినట్టు సినీ నిర్మాత సమీర్ అలీఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోయంబేడు పోలీస్ స్టేషనులో కేసు నమోదైంది. దీనిపై శ్యామ్ సీఎస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మాత సమీర్ తనపై ఫిర్యాదు చేసిన కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని వెల్లడించారు.

మార్కెట్ యార్డులకు చేరుతున్న మామిడి కాయలు

చిత్తూరు సెంట్రల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి కోతలు మొదలవడంతో మార్కెట్ యార్డులకు కాయలను భారీగా తరలిస్తున్నారు. జిల్లాలో చిత్తూరు, బంగారుపాళ్యం మ్యాంగో మార్కెట్ యార్డులు ఉన్నాయి. రెండ్రోజుల నుంచి చిత్తూరు యార్డుకు మామిడి కాయలు చేరుతున్నాయి. ప్రస్తుతం బేనీషా, పుల్లూరా, ఖాదర్ వంటి రకాలు వస్తుండగా, త్వరలో తోతాపురి రకం రానున్నాయి. రోజువారీగా 150 టన్నుల కాయలు యార్డుకు చేరడంతో ఆ శాఖ అధికారులు సైతం రైతులకు ప్రయోజనం చేకూర్చే దిశగా చర్యలు చేపడుతున్నారు. బేనీషా టన్ను ధర రూ.20-30వేల వరకు పలుకుతుండగా, దీన్ని రూ.35 వేలకు పెంచడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు చొరవ చూపుతున్నారు. పుల్లూరా టన్ను కేవలం రూ.9వేలు పలుకుతుండగా, రూ.15వేలు చేయనున్నారు. ఖాదర్ టన్ను ధర రూ.29 వేలు ఉండగా, రూ.32వేలు చేయనున్నారు. వచ్చేవారంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు మామిడి కాయలు రానున్నాయి. వచ్చే వారంలో రోజుకు 400 మెట్రిక్ టన్నులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కోతలు పెరడంతో గుజ్జు తయారీ కోసం మామిడి రైతులు పొలాల నుంచి నేరుగా ఫ్యాక్టరీలకు కూడా కాయలను తరలిస్తున్నారు.



చిత్తూరు మార్కెట్ యార్డు చేరిన బేనీషా రకం మామిడి కాయలు

దోపిడీ దొంగల అరెస్టుకు రిహార్సల్

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనరేట్, ఈస్ట్ జోన్ పరిధిలో దోపిడీ దొంగల అరెస్టు కోసం రెడ్ అలెర్ట్ పేరుతో పోలీసులు రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈస్ట్ జోన్‌లో దారిదోపిడీలు, చోరీలు ఎక్కువయ్యాయి. దీంతో పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు దోపిడీ దొంగలను గుర్తించి పట్టుకునేలా రెడ్ అలెర్ట్ పేరుతో పోలీసులు రిహార్సల్ నిర్వహిస్తున్నారు. దోపిడీ దొంగలు కనిపించినపుడు వారిని ఏ విధంగా పట్టుకోవాలో స్థానికులకు వివరించే ప్రయత్నం తమ రిహార్సల్స్ ద్వారా చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ముక్కల చెరువులో ముగ్గురు చిన్నారుల మునక

బాలిక మృతి

శ్రీరంగరాజపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లిన ఓ బాలిక మృతి చెందింది. ఇద్దరు చిన్నారులు ఆస్పత్రి పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా పొన్నైకి చెందిన లావణ్య(12) వేసవి సెలవులు కావడంతో చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం మండలం 50బసివిరెడ్డిపల్లెలో ఉన్న మేనత్త లత ఇంటికి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం లత తన పిల్లలు కార్తీక్ , పల్లవితోపాటు అన్న కూతురు లావణ్యను తీసుకుని సమీపంలోని ముక్కల చెరువులో చేపలు పట్టడానికి వెళ్లింది. ఆమె చేపలు పడుతుండగా, పిల్లలు చెరువులో సరదాగా ఈత నేర్చుకుంటూ ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడి ముగ్గురూ మునిగిపోయారు. గమనించిన లత ఆ ముగ్గురినీ బయటకు తీశారు. స్పృహ కోల్పోయిన వారిని 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లావణ్య మృతి చెందగా, కార్తీక్, పల్లవికి చికిత్స అందించడం తో వారిద్దరూ కోలుకుంటున్నారని సమాచారం.

బీరు తెగ తాగేస్తున్నారు..



- మూడు రెట్లు పెరిగిన అమ్మకాలు
- ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే రోజుల్లో అధికం

అడయార్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీరు అమ్మకాలు ఒక్కసారిగా మూడురెట్లు పెరిగిపోయాయి. ఫలితంగా కేవలం మూడు రోజుల్లో ఏకంగా రూ.70 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. ముఖ్యంగా ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే రోజుల్లో బీర్ అమ్మకాలు మరింత జోరుగా సాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 5 వేల పైచిలుకు మద్యం షాపులున్నాయి. వాటికి అనుబంధంగా ఉన్న బార్లలో బీర్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా వేసవి కావడంతో మందుబాబులు బీరు ఖాళీ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మద్యం షాపుల్లో రోజువారీగా సుమారు రూ.100 కోట్ల నుంచి రూ.110 కోట్ల మేరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. వేసవిలో ఈ విక్రయాలు రూ.140 కోట్ల మేర ఉంటాయి. వేసవిలో బీర్ల అమ్మకాలే రూ.70 కోట్లకు పైగా ఉన్నట్టు టాస్మాక్ వర్గాల సమాచారం. వారాంతపు రోజులైన శని, ఆదివారాలతో పాటు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే రోజుల్లో బీర్ల విక్రయాలు అత్యధికంగా సాగుతున్నాయని టాస్మాక్ వర్గాలు పేర్కొన్నాయి.